
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 40.1 : కనిష్ఠం 23.8



నిజామాబాద్

జిల్లా వార్తలు

శనివారం 15 మార్చి 2025

రంజాన్ వేళలు

శనివారం	ఆదివారం
ఇఫ్తార్ : సా.6.31	సహర్ : ఉ.5.02

ఒకరిని అతిగా అనుమానించటానికి దూరంగా ఉండండి. కొన్ని అనుమానాలు పాపాలు అవుతాయి.



పదో తరగతి పరీక్షలకు

పకడ్బందీ ఏర్పాట్లు



- జిల్లాలో 142 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో డీఈవో అశోక్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నిజామాబాద్ అర్బన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21 నుంచి ప్రారంభంకానున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయను న్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ తెలి పారు. జిల్లా వ్యాప్తంగా 142 పరీక్ష కేంద్రాలలో పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 22,855 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఆయన వెల్లడించారు. మాస్ కాపీయింగ్ నిరోధానికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. పదో తరగతి పరీక్షల ఏర్పాట్లపై 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన మరిన్ని వివరాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో పదో తరగతి పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు ఏ విధంగా చేశారు?

డీఈవో: ఈనెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నాం. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు జరగనున్నాయి. 142పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశాం.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో ఎంతమంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు?

డీఈవో: జిల్లా వ్యాప్తంగా 22,855 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో బాలురు 11,390 మంది, బాలికలు 11,192 మంది, ప్రైవేటు విద్యార్థులు 273 మంది ఉన్నారు.

ఆంధ్రజ్యోతి: పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి ఏర్పాట్లు చేశారు?

డీఈవో: పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సరఫరా, ఆరోగ్య సిబ్బంది ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నాం. అన్నిచోట్ల డ్యుయెల్ డెస్క్ టేబుళ్లు ఉండేలా చూస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మాస్ కాపీయింగ్ నిరోధానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డీఈవో: పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. ప్రతీ కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్‌లు ఉండేలా చూస్తున్నాం. జిరాక్స్ సెంటర్లను పరీక్ష సమయాల్లో మూసి ఉంచేలా ఆదేశాలు ఇచ్చాం. ఈసారి పరీక్ష ప్రశ్నపత్రాలపై క్యూఆర్ కోడ్ ఉంటుంది. ప్రశ్నపత్రం లీక్ అయితే ఏ సెంటర్ నుంచి లీక్ అయ్యిందో తెలిసిపోయే అవకాశం ఉంది.

ఆంధ్రజ్యోతి: గ్రామీణ ప్రాంతాల్లో మాస్ కాపీయింగ్‌తో పాటు ర్యాంకులు, గ్రేడ్‌ల కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి దానిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డీఈవో: గతంలో గ్రేడ్ విధానం ఉండటంతో గ్రామీణ ప్రాంతాల్లో గ్రేడింగ్‌ల కోసం మాస్ కాపీయింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. అవి నా దృష్టిలో ఉన్నాయి. ఈసారి అలాంటి వాటికి అవకాశం లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: విద్యార్థులకు మీరు ఇచ్చే సూచనలు?

డీఈవో: విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి. తల్లిదండ్రులు సైతం విద్యార్థులను ఇతర విద్యార్థులతో పోల్చి ఒత్తిడి చేయవద్దు. పరీక్ష కేంద్రాలను ఒక రోజు ముందుగానే చూసుకుంటే ఎలాంటి ఆందోళన చెందకుండా ఉండవచ్చు. ప్రశ్నపత్రాన్ని చూసి ఆందోళన చెందకుండా వచ్చిన ప్రశ్నలకు ముందుగా జవాబులు రాసి రానివాటి గురించి తర్వాత ఆలోచించి రాయాలి. విద్యార్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకెళ్లరాదు.

(ఆంధ్రజ్యోతి, నిజామాబాద్ అర్బన్)



రియల్ ఢమాల్!

- ఉమ్మడి జిల్లాలో తగ్గిన భూముల క్రయ విక్రయాలు
- రిజిస్ట్రేషన్ శాఖకు భారీగా తగ్గిన ఆదాయం
- గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రూ.28 కోట్లు తక్కువగా వచ్చిన ఆదాయం
- సంవత్సరం కాలంగా తగ్గిన ప్లాట్లు, అపార్ట్‌మెంట్ల అమ్మకాలు

నిజామాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో భూముల క్రయ విక్రయాలు తగ్గడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఢమాల్ అయింది. సంవత్సరం కాలంగా ప్లాట్లు, ఇళ్లు, ఇళ్ల స్థలాల అమ్మకాలు తగ్గడంతో ఎక్కువగా రిజిస్ట్రేషన్‌లు కావడం లేదు. ఒకేసారి రియల్ ఎస్టేట్ పడిపోవడంతో స్థలాలు కొనేందుకు ఎక్కువ మంది ముందుకు రావడం లేదు. అపార్ట్‌మెంట్ల నుంచి ఇళ్ల వరకు అమ్మకాలు జరగడం లేదు. వెంచర్లు వేసినా కొనేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఎక్కువ మంది రియల్ ఎస్టేట్‌పై గత కొన్నేళ్లుగా పెట్టుబడులు పెట్టిన వారు ఒకేసారి తగ్గిపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ప్లాట్ల అమ్మకాలు జరగక ఇబ్బందులు పడుతున్నారు. రియల్ ఎస్టేట్ తగ్గడం వల్ల స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖపై ఆ ప్రభావం ఎక్కువగా పడింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం తక్కువగానే ఆదాయం వచ్చింది. ఇంకా 15రోజుల సమయం ఉండటంతో గత సంవత్సరం వచ్చిన విధంగా ఆదాయం రావడం కష్టమేనని అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వం గత సంవత్సరం కంటే 10 శాతం పెంచి టార్గెట్ ఇవ్వడంతో అధికారులు రిజిస్ట్రేషన్లపై దృష్టిపెట్టి పనిచేస్తున్నారు. రియల్ ఎస్టేట్ తగ్గడంతో ఆదాయం కూడా గణనీయంగా పడిపోయింది.

10 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

ఉమ్మడి జిల్లాలో మొత్తం పది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఈ కార్యాలయాల పరిధి లోనే ఇళ్ల స్థలాలు, ఇళ్లు, అపార్ట్‌మెంట్ల రిజిస్ట్రేషన్లు అవుతాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. గత ఆర్థిక సంవత్సరం 2023-24లో ఉమ్మడి జిల్లా పరిధిలో 188.95 కోట్ల ఆదాయం వచ్చింది. ఆ సమయంలో ఉమ్మడి జిల్లా పరిధిలో 10సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని ఓపెన్ ప్లాట్లు 26500 రిజిస్ట్రేషన్‌లు చేశారు. వీటి వల్ల 73 కోట్ల 8లక్షల 96,688 రూపాయల ఆదాయం వచ్చింది. ఇళ్ల రిజిస్ట్రేషన్లు ఉమ్మడి జిల్లాలో 38,971చేశారు. వీటి వల్ల ఆ సంవత్సరం 99.04 కోట్ల ఆదాయం వచ్చింది. అపార్ట్‌మెంట్లు ఆ సంవత్సరం ఉమ్మడి జిల్లా పరిధిలోని 10 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 1745 రిజిస్ట్రేషన్‌లు జరిగాయి. వీటి వల్ల 16.81 కోట్ల ఆదాయం వచ్చింది. మొత్తం ఆ ఆర్థిక సంవత్సరంలో 188.95 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ సంవత్సరం మాత్రం గత సంవత్సరం కంటే తక్కువగా వచ్చింది. గత సంవత్సరం వచ్చిన ఆదాయంతో పోలిస్తే ఇంకా 28 కోట్ల రూపాయలు తక్కువగానే ఉంది. ఇప్పటి వరకు ఈ ఆర్థిక సంవత్సరం 2024-25లో 160 కోట్ల 63లక్షల 59,441 ఆదాయం వచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరంలొ గత ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు ఓపెన్‌ప్లాట్ల డాక్యుమెంట్లు 20,635 జరిగాయి. వీటి వల్ల రిజిస్ట్రేషన్ శాఖకు 54కోట్ల 29లక్షల 85,715 రూపాయలు సమకూరాయి. అపార్ట్‌మెంట్ల ద్వారా ఉమ్మడి జిల్లా పరిధిలోని 10 సబ్ రిజిస్ట్రార్‌ల కార్యాలయాల పరిధిలో 1475 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్‌లు అయ్యాయి. వీటి వల్ల 15కోట్ల 34లక్షల 78,770 రూపాయల ఆదాయం సమకూరింది. ఇళ్ల రిజిస్ట్రేషన్‌లు ఉమ్మడి జిల్లా పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరంలో 36,783 డాక్యుమెంట్లు అయ్యాయి. వీటి వల్ల 90కోట్ల 98లక్షల 95,306 రూపాయల ఆదాయం సమకూరాయి.

ఏడాదిగా నిలిచిన క్రయవిక్రయాలు

ఉమ్మడి జిల్లాలో గడిచిన సంవత్సరం కాలంగా ఇళ్ల స్థలాలు, ఓపెన్ ప్లాట్లు ఎక్కువగా అమ్మకాలు జరగడం లేదు. ఉమ్మడి జిల్లాలోని నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బోధన్, ఆర్మూర్, భీంగల్, కామారెడ్డి, దోమకొండ, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ఈ సారి రిజిస్ట్రేషన్లు తగ్గాయి. ఉమ్మడి జిల్లా పరిధిలోని అన్ని మున్సిపాలిటీలతో పాటు మండల పరిధిలో రియల్ ఎస్టేట్ వెంచర్లు భారీగా వెలిసాయి. నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, కామారెడ్డి, బాన్సువాడ పరిధిలో అపార్ట్‌మెంట్ల నిర్మాణం కూడా పెరిగింది. ఓపెన్ ప్లాట్లతో పాటు అపార్ట్‌మెంట్ల కొనుగోలుకు ఎక్కువ మంది మొగ్గు చూపకపోవడం వల్ల అమ్మకాలు జరగడం లేదు. రెండు సంవత్సరాల కిందితో పోలిస్తే క్రయ విక్రయాలు భారీగా నిలిచిపోయాయి. ఓపెన్ ప్లాట్లతో పాటు అపార్ట్‌మెంట్ల అమ్మకాలు తగ్గడం వల్ల ఆ ప్రభావం రిజిస్ట్రేషన్లపై పడింది. గతంలో వెంచర్లు చేసిన అపార్ట్‌మెంట్ల నిర్మాణం చేపట్టిన మొదలు పెట్టినప్పటి నుంచి అమ్మకాలు జరిగేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఉమ్మడి జిల్లా పరిధిలో వీటిపై పెట్టుబడి పెట్టిన వారు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా సంవత్సరం కాలంగా మాత్రం క్రయ విక్రయాలు పెరగడం లేదు. ఇండిపెండెంట్ల ఇళ్ల అమ్మకాలు కూడా తగ్గాయి. ఇండిపెండెంట్ ఇళ్లు, అపార్ట్‌మెంట్ నిర్మాణం చేస్తున్న బిల్డర్లు బ్యాంక్ రుణాలు ఇప్పిస్తున్న కొనుగోలు చేసేందుకు మాత్రం ఎక్కువ మంది ముందుకు రావడం లేదు. ఉమ్మడి జిల్లా పరిధిలో హైడ్రా ఎఫెక్ట్ కూడా కనిపిస్తుంది. హైదరాబాద్‌లో బహుళ అంతస్తుల భవనాలను కూడా కూల్చివేస్తుండటంతో అన్ని పరిశీలించిన తర్వాతనే కొనుగోలు చేసేందుకు ముందుకు వస్తున్నారు. బఫర్ జోన్, నాలా కన్వర్షన్‌తో పాటు ఇతర అంశాలు పరిశీలించిన మీదటనే కొనుగోలు చేస్తున్నారు. గతంలో వెంచర్లు చేసిన వారు నాలా కన్వర్షన్‌లు చేయకపోవడం చెరువు శిఖాల్లో వెంచర్లు చేసిన కొనుగోలు చేశారు. ప్రస్తుతం కూలగొట్టే అవకాశం ఉండటంతో ఎక్కువ మంది ముందుకు రావడం లేదు. రిజిస్ట్రేషన్లు తగ్గడం వల్లనే ఆ శాఖకు భారీగా ఈ సంవత్సరం ఆదాయం తగ్గిపోయింది.

గ్రూప్-3లో జిల్లా వాసి ప్రతిభ



మాదరి ఆనంద్

నిజామాబాద్ అర్బన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-3 ఫలితాలల్లో జిల్లా వాసి సత్తా చాటాడు. శుక్రవారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసిన గ్రూప్-3 ఫలితాల్లో జిల్లాకు చెందిన మాదారి ఆనంద్ కుమార్ రాష్ట్ర స్థాయి ఓపెన్‌లో 506వ ర్యాంక్‌తో పాటు బీసీ-సీ కేటగిరిలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. ఇటీవల విడుదలైన గ్రూప్-1, 2 ఫలితాలలో జిల్లాకు చెందిన మాదరి ఆనంద్ కుమార్ ప్రతిభచాటారు. గ్రూప్-2లో బీసీ-సీలో రాష్ట్ర వ్యాప్తంగా 5వ ర్యాంకు సాధించాడు. ర్యాంకు ప్రకారం జీఏడీ, సచివాల య ం ల లో ఏఎస్‌వోగా లేదా కోఆపరేటివ్ శాఖలో రిజిస్ట్రార్‌గా ఉద్యోగం పొందే అవకాశాలు ఉన్నాయి. గ్రూప్-1 ఫలితాలలోనూ ఆనంద్ 448 మార్కులతో డీఎస్పీ లేదా ఆర్‌డీవో ఉద్యోగం పొందే అవకాశం ఉంది. గతంలో గ్రూప్-4 ఫలితాలల్లో కమర్షియల్ టాక్స్‌లో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ ఆనంద్ స్వగ్రామం కాగా ఆనంద్ భార్య తేజస్విని కామారెడ్డిలో రెవెన్యూ విభాగంలో సీనియర్ సహాయకురాలిగా పనిచేస్తోంది.



• పిడిగుద్దులాటలో హున్సా గ్రామస్థులు

ఆంక్షల నడుమ

పిడిగుద్దులాట

- చివరి క్షణంలో అనుమతి ఇచ్చిన పోలీసులు
- పంతం నెగ్గించుకున్న హున్సగ్రామస్థులు
- ఎట్టకేలకు తాడుకు రెండు వైపులా విడిపోయి పిడిగుద్దులు కురిపించుకున్న వైనం

బోధన్ రూరల్, మార్చి14 (ఆంధ్రజ్యోతి): సాలూర మండలం హున్స గ్రామంలో శుక్రవారం పోలీసుల ఆంక్షల నడుమ పిడిగుద్దులాట నిర్వహించారు. హోలీ పండుగ సందర్భంగా గ్రామ ఆనవాయితీని కొనసాగించేలా చూడాలని గ్రామస్థులు కోరడంతో.. చివరి క్షణంలో పోలీసులు ఐదు నిమిషాల పాటు పిడిగుద్దులాటకు అనుమతి ఇచ్చారు. దీంతో గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద గ్రామస్థుల ఆనవాయితీగా.. తాడును కట్టి.. రెండు వైపులా విడిపోయి ఒకరిపై మరొకరు పిడిగుద్దులు కురిపించుకున్నారు. కొద్దిపాటి దెబ్బలు తగిలిన వారికి గ్రామ ఆచారం ప్రకారం హోలీ బూడిదను పూశారు. కాగా.. హోలీ రోజు పిడిగుద్దులాట నిర్వహించే సంప్రదాయం హున్సలో వందేళ్లకుపైగా కొనసాగుతోంది. ఈ ఆట నిర్వహించవద్దని గురువారం పోలీసులు ఆంక్షలు విధిస్తూ గ్రామ పెద్దలకు నోటీసులు జారీ చేశారు. అనాదిగా వస్తున్న ఆచారాన్ని కొనసాగించకపోతే గ్రామానికి అరిష్టం వస్తుందని గ్రామస్థులు పోలీసులకు విన్నవించారు. చివరి క్షణంలో పోలీసులు అనుమతి ఇవ్వడంతో.. గ్రామస్థులు పంతం నెగ్గించుకున్నట్లయ్యింది. చివరకు పోలీసు బందోబస్తు మధ్య పిడిగుద్దులాట ప్రశాంతంగా కొనసాగింది. పిడిగుద్దులాటను చూడడానికి చుట్టుపక్కల గ్రామాల నుండే కాక మహారాష్ట్ర, కర్నాటక తదితర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.



హున్స గ్రామంలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు



• కళాశాల విద్యార్థినుల కేరింతలు



కలర్‌ఫుల్ జోష్



- జిల్లాలో అంబరాన్నంటిన హోలీ సంబురాలు
- వాడవాడలా హోరెత్తిన వేడుకలు
- యువకులు, విద్యార్థులు, చిన్నారుల నృత్యాలు

(వివరాలు 7, 8వ పేజీల్లో..)

జిల్లాలో శుక్రవారం హోలీ వేడుకలు అంబరాన్నంటాయి. కలర్‌ఫుల్‌గా సంబురాలను జరుపుకున్నారు. ఉరకలేసే ఉత్సాహంతో యువత, విద్యార్థులు రంగులతో వీధుల్లోకి వచ్చి పరస్పరం చల్లుకున్నారు. ఆటాపాటల్లో మునిగితేలారు. ప్రజలు పెద్దఎత్తున హోలీ ఆడారు. ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఒకరికొకరు రంగులు పూసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

- న్యూస్ నెట్‌వర్క్, నిజామాబాద్



• బీజేపీ కార్యాలయంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సంబరాలు

• నగరంలో మహిళల హోలీ సందడి



బోధన్ పట్టణంలో పోస్టాఫీస్ వద్ద హోలీ వేడుకలు



కోటగిరిలో రంగులు చల్లుకుంటున్న యువకులు



నవీపేటలో జరిగిన హోలీ సంబరాలలో పాల్గొన్న యువకులు



హోలీ ఆడుతున్న మహిళలు

ఘనంగా హోలీ సంబరాలు



ఆర్మూర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద రంగులు చల్లుకుంటున్న బీజేపీ నాయకులు



తాడ్‌బిలోలిలో హోలీ వేడుకల దృశ్యం



మామిడిపల్లిలో హోలీ సంబరాల్లో పాల్గొన్న యోగా బృందం సభ్యులు



అర్గుల్‌లో హోలీ ఆడుతున్న కాంగ్రెస్ నాయకులు



హోలీసంబరాల్లో పాల్గొన్న కమ్మర్‌పల్లి ఎస్సై అనీల్ రెడ్డి, యువకులు



ఏర్గట్లలో హోలీ పండుగను జరుపుకుంటున్న చిన్నారులు

బోధన్‌రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంతో పాటు సాలూర మండలంలోని సాలూర, బోధన్ మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కులమతాలకు అతీతంగా చిన్నపెద్ద తేడా లేకుండా రంగులు చల్లుకుంటూ హోలీ పండుగ నిర్వహించారు. యువకులు, పెద్దలు తమ స్నేహితులతో కలిసి పండుగను ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. బోధన్ పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఏకచక్ర సేవా సమితి ఆధ్వర్యంలో హోలీ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణ ప్రముఖులు, మహిళలు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో ..

పెర్కిట్: పట్టణంలోని మామిడిపల్లి, పెర్కిట్, ఆర్మూర్‌లోని వివిధ వార్డులలో యువకులు హోలీ సంబరాలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద బీజేపీ నాయకులు రంగులు చల్లుకొని మిఠాయిలు తినిపించుకొని హోలీ సంబరాలు జరుపుకున్నారు. అలాగే మామిడిపల్లిలో యోగా బృందం సభ్యులు హోలీ సంబరాలను ఘనంగా నిర్వహించారు. పెర్కిట్‌లోని విశాఖ కాలనీలో కుటుంబ సమేతంగా ఒక చేరి రంగులు చల్లుకొని ఒకరినొకరు హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

కోటగిరి: మండలంలో శుక్రవారం హోలీ వేడుకలను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గురువారం రాత్రి పలు గ్రామాలలో కామదహన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచే యువకులు, చిన్నారులు, విద్యార్థులు హోలీ సంబరాల్లో మునిగిపోయారు. పోతంగల్ మండలంలో హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. రుద్రూరు మండలంలోనూ హోలీ ఘనంగా నిర్వహించారు.

రెంజల్: మండలంలోని తాడ్‌బిలోలి, కందకుర్తి, వీరన్నగుట్ట, బాగేపల్లి, కూనేపల్లి, మొగులాల్ తండా గ్రామాలలో శుక్రవారం హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా గురువారం రాత్రి కామదహనం చేసి శుక్రవారం హోలీ పండుగ నిర్వహించారు. చిన్నపెద్ద తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ పండుగ వేడుకలలో పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండలకేంద్రంతో పాటు గ్రామాల్లో ప్రజలు, యువకులు ఆనందోత్సవాల మధ్య హోలీ ఘనంగా జరుపుకున్నారు. యువకులు చిన్నారులు మహిళలు సైతం హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటు పరస్పర హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు పాటలపై స్టెప్పులువేస్తు హోలి వేడుకల్లో పాల్గొన్నారు. హాసాకొత్తూర్‌లో మాజీ ఉప సర్పంచ్ ఏనుగు రాజేశ్వర్, విండో వైస్ చైర్మన్ గడ్డం శ్రీధర్, రేవతి గంగాధర్, గడ్డం సంతోష్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం హోలీ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. గురువారం కామ దహనం చేసి శుక్రవారం హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు.

నవీపేట: మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. యువకులు, పిల్లలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలు చోట్ల మహిళలు సైతం రంగులు చల్లుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఏర్గట్ల: మండలంలో శుక్రవారం హోలీ సంబురాలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు, యువత మహిళలు తారతమ్యం లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సంతోషాన్ని పంచుకున్నారు.

బాల్కొండ, ముప్కాల్ మండలాల్లో..

ముప్కాల్: బాల్కొండ, ముప్కాల్ మం డలాల్లోని ఆయా గ్రామాల్లో ప్రజలు హోలీ సంబరాలను ఘనంగా నిర్వహించారు. గురువారం రాత్రి ఆయా గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కామదహనం నిర్వహించారు. శుక్రవారం మండలాల్లోని అన్ని గ్రామాల్లో యువకులు, మహిళలు, చిన్నారులు, పెద్దలు అందరు కలిసి హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

భీమ్‌గల్: పట్టణంలో ప్రజలు, యువకులు, అధికారులు, నాయకులు శుక్రవారం హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో సీఐ సత్యనారాయణగౌడ్ ఎస్సైన మహేష్‌కు సిబ్బంది రంగులతో హోలీ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే సర్వసమాజ్ అధ్యక్షుడు నిలం రవి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులందరు హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. పట్టణంలో యువకులు, మహిళలు, చిన్నారులు ఒకరినొకరు రంగులు చల్లుకుంటూ హోలీ వేడుకల్లో పాల్గొన్నారు.

మెండోర: హోలీ వేడుకలు శుక్రవారం మండలంలో ఉత్సహంగా జరిగాయి. చిన్నపెద్ద తేడాలేకుండా ప్రతీఒక్కరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. యువతి, యువకులు కేరింతలు కొడుతూ రోడ్లపైకి వచ్చారు. రంగులు చల్లుకోవడంతో పాటు ఆటపాటలతో ఉత్సహంగా గడిపారు. రంగులతో బుక్క గులాలు చల్లుకున్నారు. మెండోర పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై నారాయణ, పోలీస్ సిబ్బంది అల్లర్లు జరుగకుండా బందోబస్తు నిర్వహించారు.

మోర్తాడ్: మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం హోలీ పండగను సంతోషంగా జరుపుకున్నారు. మోర్తాడ్‌లో చిన్నారులు, పెద్దలు, మహిళలు, యువకులు రంగులు చల్లుకున్నారు. హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో హోలీ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం మండలంలోని గ్రామాలలో పెద్దలు, చిన్నారులు, యువతి, యువకులు యువకులు ఒకరినోకరు రంగులు చల్లుకొని ఘనంగా హోలీ వేడుకలను జరుపుకున్నారు.

ప్రశ్నించే గొంతులను నొక్కేస్తారా!?

● జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు



నందిపేటలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

నందిపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రశ్నించే గొంతులను నొక్కేస్తారా అని నిజామాబాద్ జిల్లా పరిషత్ మాజీచైర్మన్ దాదన్నగారి విఠల్ రావు ప్రశ్నించారు. రెండు రోజుల క్రితం అసెంబ్లీలో మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, అమలు కాని పథకాల గురించి ప్రశ్నించినందుకు మాజీమంత్రి జగదీశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. దీనికి నిరసనగా నందిపేట మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఎదుట రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేసి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా దాదన్నగారి విఠల్‌రావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతీ ఒక్కరికి ప్రశ్నించే హక్కు ఉంటుందన్నారు. జగదీశ్వర్‌రెడ్డిపై విధించిన సస్పెండ్ కేసులు వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశా రు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మచ్చర్ల సాగర్, కోమన్‌పల్లి రాజన్న, అయిలాపూర్ మోహన్, బాలగంగాధర్, సతీష్, తాటికాయల సాగర్, బాష, తదితరులు ఉన్నారు.

మామిడిపల్లిలో..

ఆర్మూర్‌రూరల్: మామిడి పల్లిలో బీఆర్ఎస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర ప్ర భుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డిని అసెంబ్లీలో సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రశ్నించే నాయకులను అణిచి వేయడం సరైందికాదన్నారు. ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపితే కాంగ్రెస్ నాయకులు సహించడంలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పట్టణ శాఖ అధ్యక్షుడు పూజ నరేందర్, బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సుక్కి సుధాకర్, మండల యువజన అధ్యక్షుడు అగ్గుక్రాంతి, సీనియర్ నా యకులు నచ్చు చిన్నారెడ్డి, అల్లూరి గంగారెడ్డి, విజయ్, మోహన్, సత్యానంద్, శేఖర్, హర్షద్, సైఫ్, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో బీఆర్ఎస్ శ్రేణుల నిరసన

కమ్మర్‌పల్లి: బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్‌ను రాష్ట్ర అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్రపార్టీ పిలుపు మేరకు శుక్రవారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో జాతీయ రహదారిపై మండల బీఆర్ఎస్ నాయకులు నిరసన చేపట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ, సీఎం రెవంత్‌రెడ్డి డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్, బద్దం చిన్నారెడ్డి, కుంట ప్రతాప్ రెడ్డి, ప్రకాశ్ నాయక్, బద్రి, పలు గ్రామాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రూ.50వేల ఎల్‌వోసీ అందజేత

ముప్కాల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ అహ్మద్ కాలుకు ఇన్ఫెక్షన్ సోకి సర్జరీ అవసరం ఉండడంతో స్థానిక ప్రజాప్రతినిదులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్ళారు. దీంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో కాలు ఆపరేషన్ కోసం రూ.50వేల ఎల్‌వోసీ మంజూరు చేసిన ఎల్‌వోసీ కాపీని సంబంధిత కుటుంబసభ్యులకు శుక్రవారం ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అందజేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కమ్మర్‌పల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హసాకొత్తూర్ మారుతి నగర్ కాలనిలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు కమ్మర్‌పల్లి ఎస్సై అనీల్ రెడ్డి తెలపారు. వారివద్ద నుంచి 5 వేల 230 రూపాయల నగదు నాలుగు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కసునమోదు చేసినట్లు తెలిపారు.

ఘనంగా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి జన్మదిన వేడుకలు



మెండోరలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



బాల్కొండలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

కమ్మర్‌పల్లి, మార్చ్ 14(ఆంధ్రజ్యోతి) మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ కమ్మర్‌పల్లి మండల పార్టీ కార్యాలయంలో మండల నాయకులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు రేగుంట దేవేందర్, బద్దం చిన్నారెడ్డి, కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుంట ప్రతాప్ రెడ్డి, ప్రకాశ్ నాయక్, మండల మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు నాయకులు బద్రి, ఏనుగు రాజేశ్వర్, గంగారెడ్డి, అవారి మురళి, సదాశివ్ గౌడ్, బద్దం రాజేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏర్గట్ల: ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి జన్మదినాన్ని శుక్రవారం బీ ఆర్ ఎస్ నాయకులు పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి సంబురాలు జరి పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి, భారస మండలాధ్యక్షుడు పూర్ణానందం, మాజీ ఎంపీటీసి జక్కని మధు, బద్ధం శ్రీనివాస్ రెడ్డి, క్యాతం సుభాష్, నాగిరెడ్డి రాజేందర్, బద్ధం ప్రభాకర్, బద్ధం హన్మాండ్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మెండోర: మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను మండలంలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం డీసీసీబీ డైరెక్టర్ నాగంపేట్ శేఖర్ కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మచ్చర్ల రాజారెడ్డి, సామ గంగారెడ్డి, గోపిడి గంగారెడ్డి, నవీన్‌గౌడ్, ఏలేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో..

ముప్కాల్: బాల్కొండ మండల కేంద్రం లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి జన్మదిన వేడుక లను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. అలాగే ముప్కాల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసిన బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ స్వీట్లు ఒకరినోకరు పంచుకున్నారు. అనంతరం క్యాంప్ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయగా. బీఆర్ఎస్ నా యకులు రక్తదానం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ, ముప్కాల్ బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్, బద్దం ప్రవీన్‌రెడ్డి, దాసరి వెంకట్‌రెడ్డి, నాగభూషన్, సురాజ్‌రెడ్డి, సాగర్‌యాదవ్, రఘునాథ్, శ్రీనివాస్ గౌడ్, మహేష్, శ్రీనివాస్‌గౌడ్, ప్రవీన్, తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్: ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి జన్మదినాన్ని మండల బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే జన్మదిన కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య, మాజీజడ్పీటీసీ చౌట్‌పల్లి రవి, నాయకులు భగత్, మూత లింబాద్రి, సతీష్‌గౌడ్, బోదిరె నర్సయ్య, శర్మనాయక్, సుర్జిల్, రెహమన్, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో..

ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి జన్మదిన పురస్కరించుకొని మాజీ ఎంపీపీ ఆర్మూర్ మహేష్, బీఆర్ఎస్ నాయకులు పసుల నితిష్, పోతుగంటి నిశాంత్, కొమ్ము నరేష్, శోభన్, సాయికుమార్, రాముగౌడ్‌లు హైదరాబాద్ వెళ్లి ఎమ్మెల్యే నివాసంలో ప్రశాంత్‌రెడ్డికి జన్మదిన,హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి ఒకరినోకరు పంచు కున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మాజీసర్పంచ్ బోగ ఆనంద్, సొసైటీ చైర్మన్ బద్దం అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు గడ్డం చిన్నారెడ్డి, మాజీజడ్పీటీసీ బద్దం రవి, బీఆర్ఎస్ నాయ కులు తీగెల సందీప్, గడ్డం మల్లేష్, వెల్మ రవీందర్‌రెడ్డి, గంగారెడ్డి, ఎంపీపీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, ఏలియా, తదితరులు పాల్గొన్నారు.

బుద్ధ దేవాలయాలు బౌద్ధులకే చెందాలి

మోర్తాడ్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): బుద్దగాయ పుణ్యక్షేత్రమైన మహాబోధి మహా వీర విహార్‌ను బ్రహ్మణులకు బౌద్ధులే సభ్యులుగా ఉండాలని ఆల్ ఇండియా బుద్ద సొసైటీ ఉపాధ్యక్షుడు పత్తే సత్యబోధి ఒక ప్రకటనలో తెలిపారు. బుద్ద గయాలో బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని నిరసిస్తూ ఆల్‌ఇండియా బుద్ద ఫోరం కమిటీ ఆధ్వర్యంలో గత ఫిబ్రవరి 12నుంచి మహాధర్నా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులుగా వచ్చి బోదివృక్ష వద్ద తపస్సు చేసి సంపూర్ణ జ్ఞానోదయం చోట బోదివృక్ష బౌద్ధులకు ఎంతో పుణ్య ప్రదేశామని పేర్కొన్నారు. బుద్దగాయ దేవాలయం 1949 చట్టాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చి బుద్ధుని మందిరంలో తొమ్మిది మంది సభ్యులలో ఐదుగురు బ్రాహ్మణులను నియమిస్తూ కేవలం నలుగురు బౌద్ధులను నియమించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీటీ, 1949చట్టాన్ని రద్దు చేస్తూ బౌద్ధ దేవాలయాలు బౌద్ధులకే చెందాలని గత 32రోజులుగా మహాధర్నా పాల్గొంటున్నామన్నారు. పాలెం గ్రామ నివాసి బౌద్ధి బిక్షువు వట్టే సత్య మూర్తి మాట్లాడుతూ గ్రామ గ్రామాన నిరసనలు తెలపాలన్నారు.



బుద్దగాయలో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న బౌద్ధ భిక్షువులు

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



తొర్లికొండ ఆలయంలో ఊంజల సేవలో పాల్గొన్న భక్తులు

జక్రాన్‌పల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండ గ్రామంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి ఊంజల సేవ నిర్వహించారు. ఈ ఊంజాల సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు

మోస్రా, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): చందూర్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు శుక్రవారంతో 4వ రోజుకు చేరుకున్నాయి. ఎస్సీ కుల వర్గీకరణ బిల్లు ఆమోదం తెలిపే వరకు దీక్షను విరమించబోమని జిల్లా నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మాట్లాడుతూ జనాభా నిష్పత్తి ప్రకారం వెంటనే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ దీక్ష కొనసాగించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు సాయిలు, గంగారాం, దొండ శ్రీనివాస్, గణపురం భూమయ్య, పాండు, పెంట నందు నాని, గణపురం పొట్టి గంగారాం, గంగాధర్ పాల్గొన్నారు.

20 ట్రిప్పుల ఇసుక డంప్ సీజ్

నందిపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తల్వేద గ్రా మంలో అకరమంగా నిల్వ ఉంచిన 20ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక డంప్‌ను శుక్రవారం ఎస్సై ఎం.చిరంజీవి సీజ్ చేశారు. నవీపేట మండలం నాలేశ్వర్, నందిపేట మండలం తల్వేద గ్రామాల మధ్య ఉన్న వాగు నుంచి వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం రావడంతో పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా 20ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక డంప్‌ను సీజ్ చేశారు. అంతేగాకుండా స్థానిక వీఆర్‌ఏ, కారోబార్ ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించి ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమంగా అక్రమంగా తరలించిన డంప్ చేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ట్రాక్టర్ యాజమానులు డ్రైవర్‌లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, అంతేగాకుండా పెద్దమొత్తంలో జరిమానాలు విధిస్తామని ఎస్సై ఎం.చిరంజీవి హెచ్చరించారు.

వాగులో పడి వ్యక్తి మృతి



మృతుడు గోపు భోజన్న

మాక్లూర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంజిలి గ్రామానికి చెందిన గోపు భోజన్న (50) అనే వ్యక్తి వాగులో పడి మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మృతుడు శుక్రవారం పంట పొలాలకు పైపులు ఫిట్టింగ్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు వాగులో పడి చనిపోయినట్లు ఎస్సై తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

అగ్నిప్రమాదంలో రెండు ఇళ్లు దగ్ధం



ప్రమాదంలో కాలిబూడిదైన నగదు, సామగ్రి

కోటగిరి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండలంలోని అంబం(ఆర్) గ్రామంలో శుక్రవారం ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో రెండు ఇళ్లు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన లక్ష్మి, సావిత్రిలకు చెందిన ఇళ్లు ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో పూర్తి కాలిపోయాయి. ఈ ప్రమాదంలో ఇళ్లలో ఉన్న బంగారం, వెండి, నగదు, నిత్యావసర సరుకులు పూర్తిగా కాలిపోయి నిరాశ్రయులుగా మిగిలారు. సుమారు మూడు లక్షల ఆస్తినష్టం సంభవించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఫైర్ స్టేషన్ అధికారులు సకాలంలో చేరుకుని మంటలను ఆర్పడంతో ప్రమాదం తప్పింది. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

ప్రతీ విద్యార్థి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

పెర్కిట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి నలంధ పాఠశాలలో 21వ వార్షికోత్సవ సంబరాలు ఘ నంగా నిర్వహించారు. మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వివేకానందరెడ్డి, మండల విద్యాధికారి రాజగంగారాం, ఈ అభ్యాస్ అకాడమి వ్యవ స్థాపకులు డాక్టర్ భువనగిరి, ఫణి పవన్‌శాస్త్రీలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి గొప్ప వ్యక్తుల జీవితాలను ప్రేరణగా ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాం క్షించారు. జబర్దస్త్ నటులు నూక రాజు, ఇమాన్యుయేల్, సీరియల్ నటి చామంతి, ప్రత్యుషలు వేడుకల్లో పాల్గొని అలరించారు. వార్షికోత్సవ సంబరాల్లో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని వార్షికోత్సవాన్ని విజయవంతం చేసినందుకు యాజమాన్యం ప్రసాద్, సాగర్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

మార్క్స్ స్ఫూర్తితో ఉద్యమిస్తాం

ఆర్మూర్‌రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బానిస సంకెళ్ల నుంచి కార్మిక శ్రమను దోచుకుంటున్న పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా బడుగు బలహీన వర్గాలను చైతన్యవంతం చేసి మార్క్స్ స్ఫూర్తితో రానున్న రోజుల్లో ఉద్యమిస్తామని సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లెపు వెంకటేష్, సీపీఐ ఎంఎల్ డివిజన్ కార్యదర్శి దాసు అన్నారు. శుక్రవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో కార్ల్ మార్క్స్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ నాయకులు దేశ ప్రజల మధ్య చిచ్చుపెట్టి మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ రాజకీయ లబ్ధిపొందుతున్నారని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కుతాడి ఎల్లయ్య, సాయిలు, నవీన్, రవి, కుల్‌దీప్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆనందోత్సవాల మధ్య హోలీ

హోలీ జోష్

- హోలీరా.. హోలీ చమ్మకేళి అంటూ వేడుక
- రంగులమయంగా మారిన జిల్లాలోని వీధులు
- సంబరాల్లో యువతీ, యువకులు
- వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు



కాకతీయ బాయ్స్ హాస్టల్ వద్ద హోలీ సంబరాలు



హోలీ గన్.. వేసేయ్ రంగ్..

ఆకాశం వైపు రంగులు వదులుతూ..

నిజామాబాద్ కల్చరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): హోలీరా హోలీ చమ్మకేళీ అంటూ ఆనందోత్సవాల మధ్య హోలీ పండుగను జిల్లా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. జిల్లావ్యాప్తంగా శుక్రవారం హోలీ సంబరాలు అంబరాన్ని అంటాయి. హోలీ పండుగలో చిన్న, పెద్ద తారతమ్యాలు లేకుండా వేడుకల్లో పాల్గొని పండుగను జరుపుకున్నారు. ఉదయం నుంచే వీధుల్లో యువతీ,యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ పండుగ శుభకాంక్షలు తెలుపుకున్నారు. పలు ప్రాంతాల్లో హోలీ పండుగను పురస్కరించుకుని సహజసిద్ధమైన రంగులను ఉపయోగించి వేడుక జరుపుకోగా మరికొన్ని ప్రాంతాల్లో పుష్పాలను జల్లుకుంటూ వేడుకలను చేసుకున్నారు. యువకులు బైకులపై తిరుగుతూ దారిన పోయేవారికి ఆత్మీయంగా పలుకరించుకుంటూ రంగులు చల్లారు. హోలీ వేడుకల్లో ప్రజాప్రతినిదులు, అధికారులు పాల్గొని ఉత్సహాపరిచారు. పలు సంస్థలు బ్యాండు వాయిద్యాలతో వీధుల్లో తిరుగుతూ హోలీని జరుపుకోగా విద్యార్థులు యువతీ, యువకులు పాఠశాలల్లో, కళాశాల్లో ఉత్సాహంగా పండుగను జరుపుకున్నారు.

● రంగులమయంగా మారిన వీధులు

హోలీ పండుగను పురస్కరించుకుని వివిధ రంగులు ఒకరిపై ఒకరు చల్లుకోవడంతో వీధులన్ని రంగులమయంగా మారాయి. చిన్నారులు మొదలుకొని పెద్దవారు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొని ఒకరిపై ఒకరు రంగుల నీళ్ల చల్లుకుని పండుగను జరుపుకున్నారు. గ్రామాలు మొదలుకొని మండల, పట్టాణాలు వరకు ఉదయం నుంచి సాయంత్రం వరకు పండుగ జరుపుకోవడంతో హోలీ సంబరాలతో మిన్నంటాయి. అపార్ట్‌మెంటులు, గ్రేటర్ కమ్యూనిటీ, అభివృద్ధి కాలనీల కమిటీ, స్వచ్చంధ సంస్థలు, లేడీస్, బాయ్స్ హాస్టళ్లల్లో హోలీ పండుగను పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసుకుని వేడుకలు జరుపుకున్నారు.

బీజేపీ కార్యాలయంలో అంబరాన్నంటిన సంబరాలు

జిల్లా కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యలయంలో హోలీ పండుగ వేడుకలు ఘనంగాసాగాయి. వేడుకల్లో భాగంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ పండుగను జరుపుకున్నారు. హోలీ వేడుకలకు ముఖ్యఅధితిగా హాజరయిన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారయణ నాయకులపై, కార్యకర్తలపై రంగులుచల్లి శుభకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే బ్యాండ్ వాయిస్తూ కార్యకర్తల్లో జోష్ నింపారు. అనంతరం ఎమ్మెల్యే ప్రతీ కార్యకర్తలను ఆత్మీయంగా పలుకరించి తీపిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందు సంప్రదాయంలో ప్రతి పండుగ శాస్త్రీయత కూడి ఉంటుందని అన్నారు. హోలిక అనే రాక్షసి అంతమొందించి చేసుకునే గొప్ప వేడుక హోలీపండుగ అని అన్నారు. వసంత రుతువుకు నాందిగా పండుగలో రుతు సంబంధమైన వ్యాధులు ప్రభల కుండా పండుగలో సహజసిద్ధమైన ఔషధ గుణాలున్న రంగులతోనే వేడుక జరుపుకుంటారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హోలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ధన్‌పాల్



నగరంలో రంగులు పూసుకుంటున్న మహిళలు

నృత్యాలు చేస్తూ..



గోశాల వద్ద భజన కార్యక్రమంలో కళాకారులు



కాకతీయ కళాశాల వద్ద యువతుల కేరింతలు




సాయినగర్‌లో రంగులు ఆడుతున్న చిన్నారులు



ఏబీవీపీ ఆధ్వర్యంలో..

పంటలకు నీరివ్వండి!

- సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని రైతు ఆవేదన
- సోషల్ మీడియాలో సెల్ఫీవీడియో వైరల్



ఎండిపోయిన లింగాపూర్ శివారులోని వాగు

నవీపేట, మార్చి14 (ఆంధ్రజ్యోతి): సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని మండలంలోని లింగాపూర్‌కు చెందిన కోరే నారాయణ అనే రైతు తీసిన సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. లింగాపూర్ ఎగువన చేపట్టిన శాఖాపూర్ ఎత్తిపోతల పథకం ద్వారా యాసంగిలో సాగు నీటిని విడుదల చేయడంతో దిగువన ఉన్న లింగాపూర్, నిజాంపూర్ శివారులతోపాటు మాక్లూర్ మండలం గుంజిలి ప్రాంతంలో పొట్టదశలో ఉన్న వరిపంట ఎండిపోతుందని ఆయన ఆవేదన వ్యక్తంచేశాడు. ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినవారు పట్టించుకోవడం లేదని తన సెల్ఫీవీడియోలో ఆరోపించాడు. ప్రస్తుతం పొట్టదశలో ఉన్న వందలాది ఎకరాల వరి పంటను కాపాడడానికి ఉన్నతాధికారులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తగిన చొరవ చూపాలని ఆయన తన సెల్ఫీ వీడియోలో వేడుకున్నాడు.



లింగాపూర్ వాగులో మోటార్లకు అందని నీరు

భక్తి

ఉత్తర తిరుపతి క్షేత్రంలో వైభవంగా బ్రహ్మోత్సవం



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నిజామాబాద్‌కల్చరల్, మార్చి14 (ఆంధ్రజ్యోతి): వేదపండితుల వేదమంత్రోచ్చరణలతో ఉత్తర తిరుపతిక్షేత్ర వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై దేవతా మూర్తులను ఉంచి అభిషేకం, ప్రత్యేక అర్చనలు జరిపారు. స్థాపితా దేవతలు, శ్రీసూక్తం, పురుష సూక్తం వేదమంత్రాలతో హోమ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ మాడ వీధులగుండా ఉత్సవ మూర్తులను ఊరేగించి భజనలు, భక్తిపాటలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సంపత్‌కుమార్, తదితర భక్తులు పాల్గొన్నారు.

● నేడు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడి కళ్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 10గంటలకు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఉత్సవ విగ్రహాలను ఉంచి కళ్యాణ వేడుకలను జరుపనున్నారు. వేదపండితులు వేదమంత్రోచ్చరణలతో నిర్వహించనున్నారు. కల్యాణం అనంతరం పెద్దఎత్తున అన్నప్రసాదం ఏర్పాటు చేయనున్నారు.

అక్రమంగా విక్రయిస్తున్న మద్యం పట్టివేత

బోధన్ రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ చౌరస్తాతోపాటు ఇతర ప్రాంతాలలోని కిరాణషాపుల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిని పట్టుకుని వారివద్ద నుంచి 50 బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. వారిపై కేసునమోదు చేశామన్నారు. మద్యం అక్రమంగా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వైన్స్‌లు బంద్ ఉన్న సమయంలో కిరాణషాపుల్లో, ఇతర స్థావరాలలో మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



బెల్టు షాపులో మద్యం పట్టుకున్న పోలీసులు(ఫైల్)

పేరుకే బంద్..
ఫుల్లుగా మందు!

- హోలీ పండుగవేళ మద్యం షాపుల మద్యం జోరు
- బెల్టు షాపులలో ఫుల్‌స్టాక్
- విచ్చలవిడిగా విక్రయాలు
- పట్టించుకోని ఎక్సైజ్ శాఖాధికారులు

బోధన్ రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): హోలీ పండుగ నేపథ్యంలో గురువారం సాయంత్రం 6గంటలకే ఎక్సైజ్ అధికారులు వైన్స్ బార్ అండ్ రెస్టారెంట్‌లకు తాళాలు వేసి సీజ్ చేశారు. గురు, శుక్రవారాలు బంద్ ఉన్న నేపథ్యంలో అబ్కారీ అధికారులు వైన్స్ షాపులు సీజ్ చేయడానికి ముందే వైన్స్‌షాపుల్లోని సరుకు అంతా బెల్టుషాపుల్లోకి తరలించి నిల చేసినట్లు తెలుస్తోంది. వైన్స్‌షాప్‌లో మందు రేటు కంటే బెల్టు షాపు నిర్వాహకులు అధిక రేట్లకు మద్యం ప్రియులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. బెల్టు షాపుల్లో మద్యం విక్రయాలను నియంత్రించాల్సిన అబ్కారీ శాఖ, పోలీసులు చోద్యం చూస్తున్నారు.

● దాడులను విస్మరించిన అబ్కారీ శాఖ

మద్యం షాపులు బంద్ ఉన్న ప్రతీసారి బెల్టు షాపులన్నీ మద్యం ప్రియులతో కళకళలాడుతున్నాయి. బోధన్ పట్టణంతో పాటు మండలం, బోధన్ డివిజన్‌లోని పలు మండలాలు, గ్రామాల్లో బెల్టు షాపులలో జోరుగా మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయి. బెల్టు షాపుల నిర్వహణపై ప్రభుత్వం సిరియస్‌గా ఉన్నా అబ్కారీ శాఖ మాత్రం ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరిస్తూ బెల్టు షాపులు, వైన్స్ షాపుల నిర్వాహకులను ప్రోత్సహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇష్టారాజ్యంగా బెల్టు షాపులు నిర్వహించడంతో ప్రజలు పండుగ వేళ అధిక ధరలకు విక్రయించి మద్యం కొనుగోలు చేయాల్సి వస్తుంది. మద్యం షాపులు బంద్ ఉంటాయన్న సమాచారం ముందుగా



తెలుసుకున్న బెల్టుషాపు నిర్వాహకులు రెండు రోజులకు సరిపడా అంతకంటే ఎక్కువ మందును తీసుకుని రహస్య ప్రదేశంలో ఉంచుతున్నారు. మద్యంప్రియులు రాగానే క్వాటరుకు రూ. 50 పైనే, బీరుకు రూ.200 పైనే అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ముందుగానే డంప్ చేస్తున్న మందును పోలీసులు, ఎక్సైజ్ అధికారులకు తెలియకుండా విక్రయాలు జరుపుతున్నాయి. అధికారుల అండదండలతోనే మద్యం విక్రయిస్తున్నారే ఆరోపణలు ఉన్నాయి.

ఇరుకు వంతెనలతో ఇక్కట్లు!


జర దేఖో!!

- అవస్థలు పడుతున్న రైతులు, వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

కమ్మర్‌పల్లి, మార్చి 14: (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్లూర్ గ్రామ శివారుల్లో ఏర్గట్ల వైపు వెళ్లే ప్రధాన రహదారిలో శ్రీరాంసాగర్ కాకతీయ కాలువ, రాజరాజేశ్వరనగర్ (ఆర్ఆర్‌నగర్) గ్రామ సమీపంలోని వంతెనలు ఇరుకుగా ఉండి ప్రమాదాలకు దారితీస్తున్నాయి. ఈ రహదారి గుండా ఏర్గట్ల, తాళ్లరాంపూర్‌తో పాటు ఆదిలాబాద్ జిల్లా నిర్మల్, ఖానాపూర్, కరీంనగర్ జిల్లా ఇబ్రహింపట్నం, మెట్‌పల్లి తదితర గ్రామాలకు రోజువారి ప్రయాణాలు సాగిస్తారు కాగా, ప్రతీ శుక్రవారం పవిత్ర పుణ్యక్షేత్రాలు తడ్‌పాకల్, దోంచందా, గుమ్మిర్యాల్, ఎర్దండి గంగస్నానాలకు భక్తులు రాకపోకలు సాగిస్తారు. కాకతీయ కాలువపై బ్రిడ్జీ ఇరుకుగా ఉండడంతో వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అదే రహదారిలో ఆర్ఆర్‌నగర్ గ్రామ సమీపంలో స్థానిక హనుమాన్ ఆలయ వద్ద బ్రిడ్జీ ఇరుకుగా ఉండి ప్రమాదకరమైన మలుపు ఉండడతంతో తరచూ ప్రమాదాలు జరుగున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి రెండు బ్రిడ్జీలను వెడల్పు చేయాలని స్థానికులు, వాహనాదారులు కోరుతున్నారు.



ఆర్ఆర్‌నగర్ గ్రామ శివారుల్లో ఇరుకుగా ఉండి ప్రమాదాలకు కారణమవుతున్న బ్రిడ్జి



ఉప్లూర్ కాకతీయ కాలువపై ఇరుకుగా ఉన్న బ్రిడ్జి



ఇరుకు బ్రిడ్జిలు ప్రమాదకరంగా ఉన్నాయి..

● తిప్పిరెడ్డి శ్రీనివాస్ (ఉప్లూర్)

ఉప్లూర్ గ్రామ శివారులోని కాకతీయ కాలువ బ్రిడ్జి ఇరుకుగా ఉన్నాయి. ఈ ప్రాంత వ్యవసాయ రైతులు, తోటలున్న రైతులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. రాత్రి సమయాల్లో తోటల్లోకి వెళ్లి రైతులు ఈ ఇరుకు బ్రిడ్జి వల్ల ప్రమాదాలకు గురవుతున్నారు. ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందోనని భయపడాల్సి వస్తోంది. సంబంధిత శాఖ అధికారులు బ్రిడ్జిలను వెడల్పు కార్యక్రమాన్ని చేపట్టాల్సిన అవసరం ఉంది.

రెండు బ్రిడ్జిలు లను వెడల్పు చేయించాలి

● చింతకుంట శ్రీనివాస్ (రైతు, ఉప్లూర్)

శ్రీరాంసాగర్ కాకాతీయ కాలువ బ్రిడ్జితోపాటు ఆర్ఆర్‌నగర్ వద్ద గల బ్రిడ్జీని అధికారులు ప్రత్యేక శ్రద్ధవహించి వెడల్పు చేయాలి. గతంలో కాకతీయుల కాలంలో అప్పటి అవసరాల మేరకు బ్రిడ్జీలను అలా నిర్మించారు. ప్రస్తుతం పరిస్థితులు మారడంతో ఈ బ్రిడ్జిలు ఇరుకుగా మారి ప్రమాదాలకు దారితీస్తున్నాయి. అధికారులు ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారించి రెండు బ్రిడ్జీలనూ వెడల్పు చేయాలి.



కేసీఆర్‌ను కలిసిన ప్రశాంత్‌రెడ్డి



కేసీఆర్‌తో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

సుభాష్‌నగర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తన పుట్టిన రోజు సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్‌ను వేముల ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం కలిశారు. ఆయన ఆశీర్వాదాన్ని తీసుకున్నారు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా నియోజకవర్గానికి చెందిన నేతలు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఆయన నివాసంలో కలిసి ప్రశాంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. అనంతరం హోలీ సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, సుజిత్‌సింగ్ ఠాకూర్, సిర్పరాజు, ఎక్బాల్, కరిపె రాజు, తెలంగాణ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఓటమి గెలుపునకు తొలిమెట్టుగా భావించాలి



మొదటి బహుమతి సాధించిన క్రికెట్ జట్టు

ధర్పల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఓటమి గెలుపుకు తొలిమెట్టుగా భావించాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్ అన్నారు. శుక్రవారం మండలంలోని గోవింద్‌పల్లి గ్రామంలో తిరుపతి స్మారక జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌లో 76 జట్లు పాల్గొనగా అందులో విజేతగా మొదటి బహుమతి బర్ధిపూర్‌కు చెందిన గరుడ 11 టీమ్ విజేతగా నిలువగా ధమ్మన్నపేట తాండా జగదాంబ యూత్ టీమ్ రన్నరప్‌గా నిలిచింది. మొదటి బహుమతి సాధించిన జట్టుకు రూ.15వేల నగదు, ద్వితీయ బహుమతి సాధించిన టీమ్‌కు రూ.7వేల నగదును అందజేశారు. ఫైనల్ మ్యాచ్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబర్చిన ధర్మన్నకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ లభించగా టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రతిభకనబర్చిన పరుశురాంకు మ్యాన్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డు లభించింది. యువకులు క్రీడల్లో రాణించాలని ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తున్నట్లు చిన్నబాల్‌రాజ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ధర్పల్లి సింగిల్ విండో చైర్మన్ మల్లికార్జున్, వై.గంగారెడ్డి, గోవింద్‌పల్లి అభివృద్ధి కమిటీ సభ్యులు మోహన్, సేవాలాల్, యువకులు పాల్గొన్నారు.

పోలీసు కస్టడీలో వ్యక్తి అనుమానాస్పద మృతి

- పోలీసులే కొట్టి.. చంపేశారని కుటుంబసభ్యుల ఆరోపణ
- న్యాయ విచారణ జరపాలని డిమాండ్
- నష్ట పరిహారంగా రూ. కోటి ఇవ్వాలని ఆందోళన
- ఏసీపీ నచ్చచెప్పడంతో శాంతించిన కుటుంబసభ్యులు
- హార్ట్ ఎటాక్‌తో చనిపోయాడని ప్రకటించిన సీపీ
- న్యాయాధికారి సమక్షంలో వీడియోగ్రఫీ ద్వారా పోస్టుమార్టం



సంపత్ (ఫైల్)

ఖిల్లా, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైమ్ కేసులో పోలీసుల కస్టడీలో ఉన్న పెద్దపల్లి జిల్లా అంతర్గామ్ గ్రామానికి చెందిన అలకుంట సంపత్ (32) అనే యువకుడు గురువారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది. కేసులో విచారణ కోసం తీసుకొచ్చిన సంపత్‌ను పోలీసులే కొట్టి చంపేశారని ఆరోపిస్తూ మృతుడి కుటుంబీకులు ఆందోళన చేశారు. వివరాల్లోకి వెళితే.. పెద్దపల్లి జిల్లా అంతర్‌గామ్‌లోని ఒడ్డెర కాలనీకి చెందిన సంపత్.. జగిత్యాలలోని శ్రీరామ ఇంటర్నేషనల్ మ్యాన్‌పవర్ కన్సల్టెన్సీ మేనేజర్‌గా పని చేసేవాడు. డాటీ ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని రాష్ట్రవ్యాప్తంగా పలువురి వద్ద నుంచి రూ.లక్షల్లో వసూలు చేశాడు. లావోస్ దేశం పంపించి అక్కడ సైబర్ నేరాలు చేయించడంతో.. వారు ఉద్యోగం చేయడం ఇష్టం లేక అక్కడి భారత రాయబార కార్యాలయానికి వెళ్లి.. అధికారుల సహకారంతో ఇండియాకు తిరిగి వచ్చారు. ఆ తర్వాత విషయాన్ని బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో.. అలకుంట సంపత్, దండుగ చిరంజీవి, రాజారెడ్డి అనే వ్యక్తులను నిజామాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు ఇటీవల అదుపులోకి తీసుకున్నారు. ఈనెల 4వ తేదీన ఈ ముగ్గురినీ రిమాండ్‌కు తరలించారు. కేసుకు సంబంధించిన మరిన్ని వివరాల విచారణ నిమిత్తం ఈనెల 12న కోర్టు అనుమతితో సైబర్ క్రైమ్ పోలీసులు ఈ ముగ్గురిని కస్టడీలోకి తీసుకున్నారు. ఆ తర్వాత సైబర్‌క్రైమ్ పోలీసులు.. సంపత్‌ను జగిత్యాల జిల్లాకు తీసుకెళ్లి విచారణ చేసి.. మళ్లీ నిజామాబాద్‌కు తీసుకొచ్చారు. నిజామాబాద్‌లోనూ విచారణ జరుపుతున్న సమయంలో సంపత్‌కు ఎడమ చేయి నొప్పి రావడంతో.. గురువారం రాత్రి 9.45 గంటలకు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాత్రి 10.30 గంటలకు గుండె నొప్పి రావడంతో మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషయాన్ని మృతుడి కుటుంబీకులకు పోలీసులు సమాచారం అందించారు. అయితే కస్టడీలో ఉన్న సమయంలో పోలీసులు పెట్టిన చిత్రహింసలు, వారు కొట్టిన దెబ్బలతోనే సంపత్ మృతి చెందాడని మృతుడి కుటుంబీకులు ఆరోపిస్తూ.. శుక్రవారం నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి ఎదుట ధర్నా చేశారు. పోలీసులు విచారణ పేరుతో చిత్రహింసలు పెట్టారని మండిపడ్డారు. మృతుడి శరీరంపై గాయాలు ఉన్నాయని, పోలీసులు కొట్టిన దెబ్బలు భరించలేకే మృతి చెందాడని ఆరోపించారు. సంపత్ మృతిపై న్యాయ విచారణ జరపాలని,



ప్రభుత్వాసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబీకులు

అతని కుటుంబానికి నష్టపరిహారంగా కోటి రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న నిజామాబాద్ ఏసీపీ రాజవెంకటరెడ్డి వెంటనే ఘటనా స్థలికి చేరుకున్నారు. వీడియోగ్రఫీ ద్వారా పోస్టుమార్టం నిర్వహిస్తామని హామీ ఇవ్వడంతో మృతుడి కుటుంబీకులు ఆందోళన విరమించారు. సంపత్ మృతిపై పలు అనుమానాలు ఉండడంతో పోస్టుమార్టం నివేదిక ఆధారంగా ముందు చర్యలు తీసుకుంటామని ఏసీపీ తెలిపారు. ఆ తర్వాత జిల్లా మొదటి అదనపు న్యాయాధికారి సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించి.. సంపత్ మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

అనారోగ్యంతోనే సంపత్ మృతి..

: నిజామాబాద్ సీపీ సాయిచైతన్య

పోలీసు కస్టడీలో ఉన్న సంపత్ అనే వ్యక్తి అనారోగ్యంతోనే మృతి చెందినట్లు నిజామాబాద్ పోలీసు కమిషనర్ సాయిచైతన్య శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేశారు. విచారణ పేరుతో పోలీసులు కొట్టి చంపారని కుటుంబసభ్యులు ఆందోళన చేపట్టిన నేపథ్యంలో.. సీపీ ఈ ప్రకటన విడుదల చేశారు. మృతుడు నిరుద్యోగ యువతను థాయిలాండ్, లావోస్‌లకు పంపించి అక్కడ బానిసలుగా మార్చేవాడని చెప్పారు. మోసపోయిన బాధిత యువకులు ఫిర్యాదు చేయడంతో ఆయనపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. కోర్టు అనుమతితో తదుపరి విచారణ కోసం కస్టడీలోకి తీసుకున్నట్లు చెప్పారు. కోర్టు అనుమతి ప్రకారం ఈనెల 12న కస్టడీకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుడు తాను నేరం చేసినట్లు అంగీకరించాడని తెలిపారు. గురువారం విచారణ నిమిత్తం జగిత్యాలలోని కన్సల్టెన్సీకి తీసుకెళ్లి.. మధ్యవర్తుల సమక్షంలో సంపత్ సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ ప్రక్రియ అంతా పారదర్శకంగా చేపట్టామన్నారు. వ్యక్తిగతంగా విచారణ చేయకుండా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎన్‌హెచ్ఆర్‌సీ, బీఎన్ఎస్ఎస్ గైడ్‌లైన్స్ ప్రకారం డీఎస్పీ స్థాయి అధికారి ద్వారా విచారణ చేయడం జరిగిందన్నారు. ఈ విషయమై మానవహక్కుల కమిషన్‌కు సైతం సమాచారం ఇచ్చామన్నారు. పోస్టుమార్టాన్ని ఫోరెన్సిక్ నిపుణులు, వైద్యుల సమక్షంలో పూర్తి పారదర్శకంగా వీడియోగ్రఫీ ద్వారా నిర్వహించినట్లు సీపీ వివరించారు.



వివరాలు వెల్లడిస్తున్న నార్త్ రూరల్ సీఐ

వ్యక్తిగత విషయాల్లో అడ్డుగా ఉందని.. తల్లిని హత్య చేసిన కూతురు, అల్లుడు

- వివరాలు వెల్లడించిన సీఐ

ఖిల్లా, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత విషయాల్లో తల్లి అడ్డుగా వస్తుందని కూతురు, అల్లుడు కలిసి హత్య చేసిన ఘటన ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలను నార్త్ రూరల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ శుక్రవారం వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని 300 క్వాటర్స్ నాగారంకు చెందిన విజయలక్ష్మి నాలుగు ఏళ్లుగా కూతురు ఇంట్లో ఉంటుంది. ప్రతీ విషయంలో తల్లి జోక్యం చేసుకుంటుందని తనకు ఇబ్బందిగా మారిందని, అన్నింటికీ అడ్డుగా వస్తుందని భావించిన కూతురు, అల్లుడు బుధవారం రాత్రి సమయంలో మొఖంపై తలదిండుతో నొక్కి గొంతును నులిపి హత్య చేశారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టిన 5వ టౌన్ ఎస్సై గంగాధర్ సిబ్బందితో కేసును ఛేదించారు. మృతురాలి కూతురు సౌందర్య, అల్లుడు రమేష్‌లు హత్య చేసినట్లు నిర్ధారణకు రావడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై గంగాధర్, సిబ్బందిని ఏసీపీ రాజావెంకటరెడ్డి అభినందించారు.

అపురూప శిల్పాలను కాపాడుకోవాలి

నిజామాబాద్ కల్చరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): చరిత్రకు సంబంధించిన అపురూప శిల్పాలు, శిలాశాసనాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రముఖ చరిత్ర పరిశోధకుడు డాక్టర్ శివనాగిరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తిలక్‌గార్డెన్‌లోగల పురావస్తు ప్రదర్శనశాల, నీలకంఠేశ్వర ఆలయంలోని శిల్పాలను, శిలాశాసనాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిల్పాలు, శిలాశాసనాలను, కాలపత్ర గ్రంథాలు, అరుదైన వస్తువులను పరిరక్షించుకొని భావితరాల వారికి వారసత్వ సంపదగా అందించాలని అన్నారు. మ్యూజియంలోని శిలాశాసనాన్ని నీలకంఠేశ్వర ఆలయంలోని శిల్పాలను పరిశీలించి ఆలయ పరిసర ప్రాంతాల్లో దోహదపడే విగ్రహాలను కాపాడుకుంటూ చరిత్రను తెలుసుకొని అభివృద్ధి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశోధకులు కందకుర్తి ఆనంద్, మ్యూజియం పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు శంకర్, కార్యదర్శి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం వసతి గదికి రూ.6 లక్షలు చెల్లించిన బోధన్ భక్తులు



చెక్కును అందజేస్తున్న భక్తులు

భద్రాచలం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం పరిధిలోని జానకీరాం సదనంలో వసతి గది కోసం బోధన్‌కు చెందిన ఎం.కృష్ణదేవరాయులు అచలా దంపతులు, డి.శాంతపార్వతి దేవి, ఎస్.విజయలక్ష్మిలు రూ.6లక్షలు చెల్లించారు. శుక్రవారం ఇందుకు సంబంధించిన చెక్కును ఈవో ఎల్.రమాదేవికి అందజేశారు. వసతి గదికి పార్ట్‌పేమెంటును చెక్కు ద్వారా చెల్లించినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

'ఎంపీని విమర్శించే స్థాయి లేదు'

సుభాష్‌నగర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను విమర్శించే స్థాయి ఎమ్మెల్యే భూపతిరెడ్డికి లేదని ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సందీప్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జక్రాన్‌పల్లి మండలంలో నవోదయ పాఠశాలకు ప్రతిపాదనలు పంపిన ఎమ్మెల్యే అసమర్థత వల్లే బోధన్‌కు తరలిందని అన్నారు. ఎమ్మెల్యే అనవసర ఆరోపణలు మాని అభివృద్ధిపై దృష్టిపెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వసంతోత్సవ వేడుకలు

నిజామాబాద్ కల్చరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మోపాల్ మండలంలోని ఇందూరు తిరుమల ఆలయంలో శుక్రవారం హోలీ పర్వదినాన్ని పురస్కరించుకొని వసంతోత్సవ వేడుకలను ఘనంగా సాగాయి. ఆలయ ప్రాంగణంలో అలంకరించిన వేదికపై శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామిని ఉంచి విశ్వక్‌సేన, పుణ్యాహవచన పూజలు ఆలయ అర్చకులు రోహిత్ ఆచార్య, విజయ్ ఆచార్య నిర్వహించారు. 9 కలశాలలో వివిధ దేవతలను ఆహ్వానం చేసి శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడికి పంచామృతాలతో అభిషేకాలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నర్సిం హారెడ్డి, సుధాకర్, రమేష్ పాల్గొన్నారు.

జిల్లాలో హోలీ సంబురాలు



సిరికొండలో రంగులు చల్లుకుని సంబరాలు జరుపుకుంటున్న యువకులు

నిజామాబాద్ అర్బన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా హోలీ సంబురాలను ఘనంగా జరుపుకొన్నారు. నగరంలో ఏర్పాటు చేసిన హోలీ సంబరాల్లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, నుడా చైర్మన్ కేశవేణులు పాల్గొన్నారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు రామర్తి గోపి, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణురాజ్, కాంగ్రెస్ నాయకులు కొండపాక రాజేష్, ప్రీతమ్, తదితరులు హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. ఒకరినొకరు రంగులు పూసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఇందూరు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో ఘనంగా హోలీ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొని నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రెంజర్ల నరేష్, స్వామియాదవ్, సుధాకర్, రాకేష్ పాల్గొన్నారు.

మోపాల్: మండలంలోని ఆయా గ్రామాల్లో హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని న్యాల్‌కల్, సిర్పూర్, ముదక్‌పల్లి, మోపాల్, మంచిప్ప, గుడితాండా, ఎల్లమ్మకుంట, కాల్పోల్, బైరాపూర్, అమ్రాబాద్, బాడ్సి, చిన్నాపూర్, సింగంపల్లి, కంజర్, కులాస్‌పూర్, ఠాణాకుర్దు, బోర్గాం(పి), గ్రామాల్లో హోలీ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. అలాగే రూరల్ మండలంలో కూడా హోలీ పండుగను ఆయా గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని గూపన్‌పల్లి, ముబారక్‌నగర్, కేశాపూర్, కాలూర్, ఖానాపూర్, సారంగపూర్, గుండారం, తిర్మన్‌పల్లి, ఆకుల కొండూర్, మల్కాపూర్, మల్లారం, మల్కాపూర్ తండాల్లో ఘనంగా జరుపుకున్నారు.

ఇందల్వాయి: మండలంలోని పలు గ్రామాల్లో హోలీ సంబరాలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. శీలం జానకీబాయి ఆధీనంలోగల కొన్ని గ్రామాలు హోలీ పండుగను గురువారం నిర్వహించగా మరికొన్ని గ్రామాలు శుక్రవారం హోలీ పండుగను జరుపుకున్నారు.

ధర్పల్లి: మండలంలో హోలీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి చిన్న పెద్ద తేడా లేకుండా ఒకరికొకరు రంగులు పూసుకొని హోలీ జరుపుకున్నారు. గురువారం రాత్రి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కామదహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హోలీ సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ సారిక హన్మంత్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కర్క గంగారెడ్డి మండల ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

సుభాష్‌నగర్: మాలమహానాడు ఆధ్వర్యంలో హోలీ పండుగ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని మాలమహానాడు కార్యాలయంలో హోలీ సంబరాలను నిర్వహించారు. ఒకరినొకరు రంగులు చల్లుకొని పండుగ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు సక్కి విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: మండలంలోని తెలంగాణ యూనివర్సిటీతో పాటు, ఏడో పోలీస్ బెటాలియన్, 33గ్రామాల్లో హోలీ పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. చిన్నపెద్ద తేడా లేకుండా కలిసి మెలిసి సోదర భావంతో రంగులు చల్లుకున్నారు. విద్యార్థులు ఏటా తెలంగాణ యూనివర్సిటీలో హోలీ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. బాలికల హాస్టల్‌లో కూడా విద్యార్థులు హోలీ సంబరాలు నిర్వహించుకున్నారు. 7బెటాలియన్ లో కూడా పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది హోలీ వేడుకల్లో రంగులు చల్లుకున్నారు. గ్రామాల్లో శుక్రవారం రాత్రి కామదహనం నిర్వహించారు. ఘన్‌పూర్‌లో 70కిలోల బండరాయిని చేతులతో పైకెత్తి భుజంపై పెట్టుకున్నాడు ఓ యువకుడు, కొన్నేళ్లుగా ఈ సంప్రదాయం కొనసాగుతుందని గ్రామస్థులు తెలిపారు.

సిరికొండ: మండలంలో హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. గురువారం రాత్రి కాముడి దహనం చేసిన ప్రజలు శుక్రవారం ఉదయం నుంచే గ్రామాల్లో చిన్నారులు, పెద్దలు, యువకులు రంగులు చల్లుకుని హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో హోలీ సంబరాలను ప్రజలు ఆనందోత్సవాల మధ్య వైభవంగా జరుపుకున్నారు మండలంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా హోలీ పండగను ప్రజలు జరుపుకున్నారు.



హోలీ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి



హోలీ వేడుకల్లో పాల్గొన్న నుడా చైర్మన్ కేశవేణు



నగరంలో హోలీ పండుగ జరుపుకొంటున్న యువకులు



నగరంలో హోలీ సంబరాలు జరుపుకొంటున్న విద్యార్థినులు



ఘన్‌పూర్‌లో హోలీ సంబరాల్లో పాల్గొన్న యువత



డిచ్‌పల్లిలో..


చికెన్ ధరలు



రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	: రూ.160	రూ.230	రూ. 250



బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.88900	రూ.82000	రూ.1030

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : చావా (తెలుగు) (10.00, 4.15)
: ఆఫీసర్ ఆన్ డ్యూటీ (1.20)
: కోర్టు (7.35, 10.40)
స్క్రీన్-2 : కోర్టు (10.00, 4.25)
: చావా (తెలుగు) (1.05, 7.30)
: చావా (హిందీ) (10.50)
స్క్రీన్-3 : చావా (హిందీ) (10.30, 1.50)
: ల్యాంప్ (5.10)
: రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (తెలుగు) (7.35)
: యుగానికి ఒక్కడు (10.45)
స్క్రీన్-4 : దిల్‌రూబా (10.15, 4.10, 7.20, 10.30)
: 1000 వాలా (1.25)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1: దిల్‌రూబా (11.00, 4.35, 7.30, 10.25)
: చావా (హిందీ) (1.40)
స్క్రీన్-2 : యుగానికి ఒక్కడు (11.00, 4.40)
: కోర్టు (1.45, 7.35, 10.30)
స్క్రీన్-3 : ఆఫీసర్ ఆన్ డ్యూటీ (1.30, 7.30)
: చావా (తెలుగు) (4.30, 10.20)

దేవి : దిల్‌రూబా (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : యుగానికి ఒక్కడు (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : చావా (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్ : కోర్టు (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్